




# కరపత్రం

SINCE 2014

సోమవారం ఫిబ్రవరి 24 2025 | సంపుటి :0 | సంచిక : 133 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4






»ఘటన స్థలం: నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం, దోమలపెంట సమీపంలో శ్రీశైలం ఎడమ గట్టు కాలువ టన్నెల్

» సహాయక చర్యలు ముమ్మరం ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, సింగరేణి రెస్క్యూ టీమ్, హైడ్రా, సికింద్రాబాద్ బైసన్ డివిజన్ ఇంజినీరింగ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు పాల్గొన్నాయి.

ముఖ్య సమస్యలు:

»టన్నెల్‌లో మట్టి, నీరు భారీగా చేరి సహాయక చర్యలకు ఆటంకం.

»13.5 కిమీ వద్ద పైకప్పు కూలడంతో సహాయక బృందాలకు సమస్యలు.

»14వ కిలోమీటర్ వద్ద 15 అడుగుల ఎత్తు బురద పేరుకుపోయింది.

మిగతాది 2లో

# ఆ 8మంది ఎలా ఉన్నారో?..

## సవాల్‌గా మారిన సహాయక చర్యలు

# ఒకే రోజు మూడు జిల్లాల్లో సీఎం

## రేవంత్ టూర్.. షెడ్యూల్ రిలీజ్



ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రచారంలో స్పీడ్ పెంచింది కాంగ్రెస్ . కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ మెదక్ గ్రాడ్యుయేట్ స్థానాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి ఒకే రోజు మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఫిబ్రవరి 24న సీఎం రేవంత్ నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించున్నారు. రేవంత్ టూర్ కు సంబంధించిన షెడ్యూల్ ను రిలీజ్ అయ్యింది.

2లో

## యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి - బంగారు గోపురం ఆవిష్కరణ

»తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించి బంగారు గోపురం ను ఆవిష్కరించారు.

»ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

2లో



# బీజేపీ వాళ్లు చేస్తే ఒప్పు.. మేం చేస్తే తప్పా..?

## బండి సంజయ్ పై మంత్రి పొన్నం ఫైర్



రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎమ్మెల్సీ ఎన్నికలను ఉదాసీనంగా తీసుకోవద్దని కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం (ఫిబ్రవరి 23) వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని శ్రీ కన్వేక్షన్ హాల్?లో అర్బన్ మండల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి విశ్వ నాథన్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గత 15 నెలలుగా మనం చేసిన అభివృద్ధి పనులు పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఎమ్మెల్సీ ఎన్నికను బాధ్యతగా తీసుకొని.. ప్రతి ఓటర్‌ను కలిసి వాళ్ల కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసేలా కృషి చేయాలని సూచించారు.

మిగతాది 2లో

# అంగన్‌వాడీల్లో కొలువుల పండగ




»రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీ సంఖ్యలో పోస్టులను ప్రభుత్వం భర్తీచేయబోతోంది.

»అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 6,399, హెల్పర్ పోస్టులు 7,837 కలిపి 14,236 పోస్టుల భర్తీ దస్త్రంపై మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం సంతకం చేశారు.

2లో

# కోహ్లీ సెంచరీ..

## పాక్‌పై భారత్ ఘన విజయం



ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఫిబ్రవరి 24 2025

## సంపాదకీయం

### వికటించిన వీధి నాటకం!

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై దాడిని ఉధృతం చేస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో ఎదురైన అనూహ్య పరాజయం నుంచి కోలుకున్న ఆయన తనదైన శైలిలో ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మాటలు, చేష్టలు అదుపు తప్పుతున్నాయి. రాష్ట్రం విడిపోయిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో తాను అధికారంలోకి వచ్చేసినట్టేనని అతి విశ్వాసంతో ఉండిన ఆయన ఓడిపోయారు. దీంతో జగన్‌రెడ్డి పనైపోయిందని భావించిన చంద్రబాబు నాయుడు ఆయనను పెద్దగా పట్టించుకోలేదు. దీంతో ప్రశాంత్ కిశోర్ మార్గదర్శకత్వంలో జగన్‌రెడ్డి అప్పటి చంద్రబాబు ప్రభుత్వంపై విష ప్రచారం చేశారు. వంచనతో కూడిన రాజకీయాలతో ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లో పెంచగలిగారు. ఫలితంగా 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించి భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో చంద్రబాబు కథ అయిపోయిందని భావించిన జగన్‌రెడ్డి తనదైన శైలిలో కక్ష రాజకీయాలకు తెర లేపారు. తన సన్నిహితులు వారించినా వినకుండా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబును అరెస్టు చేయించి జైల్లో పెట్టారు. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీతో సత్సంబంధాలు ఉండటంతో జగన్‌రెడ్డి ఆడింది ఆట పాడింది పాటగా సాగింది. 2024 ఎన్నికల నాటికి పరిస్థితులు మారిపోయాయి. 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీతో కలిసి పోటీ చేసినా, ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు మధ్య సత్సంబంధాలు ఉండేవి కావు. ఈ క్రమంలో చంద్రబాబు భారతీయ జనతా పార్టీకి దూరమయ్యారు. బీజేపీతో నేరుగా పొత్తు లేకపోయినా ఐదేళ్ల పాటు కేంద్రంలో ప్రభుత్వానికి జగన్‌రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు. కేంద్రం కూడా జగన్‌రెడ్డికి అండగా నిలబడింది. 2014 ఎన్నికల్లో జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కలిసి పోటీ చేసినా, ఆ తర్వాత వాటికి అంత ప్రాధాన్యం ఉండేది కాదు. 2019 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి సొంతంగా మెజారిటీ లభించడంతో ప్రధాని నరేంద్ర మోదీ సర్వం తానై వెలుగొందారు. 2024 నాటికి పరిస్థితులు తలకిందులయ్యాయి. భారతీయ జనతా పార్టీకి సొంతంగా మెజారిటీ లభించలేదు. 2019 ఎన్నికల్లో తాను ఈసడించుకుని దూరం పెట్టిన తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవాలని ప్రధాని మోదీ స్వయంగా నిర్ణయించుకున్నారు. మూడవసారి తన నేతృత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ మద్దతు కీలకమైంది. బిహార్‌లో నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జేడీయూ మద్దతు కూడా అవసరం అయినప్పటికీ ఇటీవలికాలంలో నితీశ్ ఆరోగ్యం క్షీణించడంతో కేంద్రంలో, ముఖ్యంగా ఎన్డీయేలో చంద్రబాబుకు ప్రాధాన్యం ఏర్పడింది. చంద్రబాబు కూడా 2019 నాటి అనుభవంతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో సత్సంబంధాలతో ముందుకు వెళుతున్నారు. గతానికి భిన్నంగా ప్రధాని మోదీ కూడా ముఖ్యమైన సందర్భాలలో ఎన్డీయేను ప్రొజెక్ట్ చేయడం మొదలుపెట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ ముఖ్యమంత్రుల ప్రమాణస్వీకారోత్సవాలకు ఎన్డీయే నేతలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. జాతీయ స్థాయిలో ఎన్డీయేకు పోటీగా రూపుదిద్దుకున్న ఇండియా కూటమి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఇండియా కూటమిలో బలంగా కనిపించిన కేజ్రీవాల్ ఢిల్లీ ఎన్నికల్లో ఓటమిపాలవడంతో భారతీయ జనతా పార్టీని ఇప్పుడు ఢీకొనగల నాయకులు జాతీయ స్థాయిలో కొరవడ్డారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తమ రాష్ట్రాలలో బలంగా ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో ప్రభావం చూపగల నాయకులు కాదు. ఈ క్రమంలో ప్రధాని తదుపరి టార్గెట్ మమతా బెనర్జీ కావొచ్చు. గతంలో భారతీయ జనతా పార్టీని మాత్రమే బలోపేతం చేయడానికి ప్రయత్నించిన ప్రధాని మోదీ ఇప్పుడు ఎన్డీయేను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో చంద్రబాబుకు మరింతగా ప్రాధాన్యం ఇస్తున్నారు. కేంద్రంలో తనకు పెరిగిన పరపతితో రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నాలు మొదలెట్టారు. ఫలితంగా కేంద్రం నుంచి వివిధ పథకాలకు భారీగా ఆర్థిక సహకారం అందుతోంది. ప్రతిపాదిత పథకాలన్నీ కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో అభివృద్ధి పుంజుకుంటుంది. లక్ష కోట్లకు పైగా నిధులు అందుబాటులోకి వస్తాయి.

#### మా సీఎం వేరే...!

జాతీయ స్థాయి పరిణామాలను, కేంద్రంలో పెరిగిన చంద్రబాబు ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కూటమి ప్రభుత్వంపై జగన్‌రెడ్డి దాడిని ఉధృతం చేశారు. ఈ క్రమంలో ఆయన ఎంచుకున్న రెండు కార్యక్రమాలూ బెడిసికొట్టాయి. ఒక కేసులో అరెస్టయిన వల్లభనేని వంశీని జైల్లో పరామర్శించిన జగన్‌రెడ్డి పోలీసులపై విరుచుకుపడ్డారు. వంశీని అరెస్టు చేసి జైల్లో పెట్టిన అధికారులు పదవీ విరమణ చేసినా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత దుస్తులు ఊడదీసి నిలబెడతానని హెచ్చరించారు. దీనిపై పోలీసు అధికారుల సంఘం ఘాటుగా స్పందించింది. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన నందిగం సురేశ్, వల్లభనేని వంశీ వంటి వారిని పరామర్శించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకోవడమే జగన్‌రెడ్డి చేసిన తప్పు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని దారుణంగా అవమానించిన వల్లభనేని వంశీపై ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు? అని కూటమి ప్రభుత్వంపై మరోవైపు ఒత్తిడి పెరిగింది. చంద్రబాబు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారంటూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో ఏకంగా పోస్టులే పెట్టారు. అయితే కార్యకర్తల వలె ఆవేశపడ కుండా చంద్రబాబు సమయం, సందర్భం కోసం వేచి చూశారు. కిడ్నాప్ కేసులో వంశీ చిక్కుకోగానే అరెస్టు చేయించారు. అధికారంలో ఉన్నప్పుడు గన్నవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వైసీపీ దాడి సందర్భంగా ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ అనే వ్యక్తిని బెదిరించి ఫిర్యాదును ఉపసంహరింపజేయించిన వల్లభనేని వంశీ మొత్తంమీద చంద్రబాబు విసిరిన వలలో చిక్కుకున్నారు. ఈ క్రమంలో జైలులో ఉన్న వంశీని జగన్‌రెడ్డి పరామర్శించారు.

# ఆ 8మంది ఎలా ఉన్నారో?..

## సవాల్‌గా మారిన సహాయక చర్యలు

మొదటిపేజీ తరువాయి

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, సింగరేణి రెస్క్యూ టీమ్, హైడ్రా, సికింద్రాబాద్ బైసన్ డివిజన్ ఇంజినీరింగ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు. సొరంగంలో మట్టి, నీరు భారీగా చేరడంతో సహాయక చర్యలకు ఆటంకమేర్పడుతోంది. 8మంది బాధితులను క్షేమంగా రక్షించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సొరంగం పైనుంచి లోపలికి వెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

130 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, 120 మంది ఎస్డీఆర్ఎఫ్, 24 మంది ఆర్మీ, 24 మంది సింగరేణి రెస్క్యూ టీమ్, 24 మంది హైడ్రా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సొరంగంలో 13.5 కిలోమీటరు వద్ద పైకప్పు కూలింది. అక్కడి వరకు వెళ్లిన సహాయక బృందాలు టన్నెల్ బోరింగ్ మిషన్ వద్దకు వెళ్లేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అక్కడి నుంచి అర కిలోమీటరు వెళ్లేందుకు మట్టి, నీటితో అడ్డంకులు ఏర్పడుతున్నాయి. హై కెపాసిటీ పంపింగ్ సెట్లు, క్రేన్లు, బుల్డోజర్ల సాయంతో ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. టన్నెల్‌లో 14వ కి.మీ వద్ద 100 మీటర్ల మేర 15 అడుగుల ఎత్తు బురద పేరుకుపోయింది. ఫిషింగ్ బోట్లు, టైర్లు, చెక్కబల్లలు వేసి దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. మరో 50 మీటర్ల బురద స్థలాన్ని దాటితేనే ప్రమాద స్థలికి వెళ్లగలమని సహాయక బృందాలు చెబుతున్నాయి. ఆర్మీ వైద్య బృందాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. 8మంది బాధితుల ఆచూకీ ఇంకా తెలియలేదని ఎన్డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సుఖేంద్ తెలిపారు. సహాయక చర్యల కోసం ఇవాళ రాత్రికి నేవీ బృందం శ్రీశైలం చేరుకోనుంది.

పైకప్పు కూలడంతో దెబ్బతిన్న యంత్రాలు, పేరుకు పోయిన బురద బాధిత కుటుంబాల్లో ఆందోళన..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 8మంది ఎలా ఉన్నారోనని బాధిత కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. తమ వారి క్షేమ సమాచారం ఎప్పుడు తెలుస్తుందా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. బాధితులను క్షేమంగా రక్షించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని మంత్రులు, అధికారులు బాధితుల కుటుంబాలకు ధైర్యం చెబుతున్నారు. జేపీ సంస్థకు చెందిన మనోజ్‌కుమార్ (పీఈ), శ్రీనివాస్ (ఎస్ఈ), రోజువారీ కార్మికులు సందీప్‌సాహు (28), జక్తాజెస్ (37), సంతోష్‌సాహు (37), అనూజ్ సాహు (25) ఉన్నారు. రాబిన్‌సన్ సంస్థకు చెందిన ఆపరేటర్లు సన్నీ సింగ్ (35), గురుదీప్ సింగ్ (40) సొరంగం లోపల చిక్కుకు పోయారు. జమ్మూ, పంజాబ్, ఝూర?ండ్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాల నుంచి వచ్చిన వీరు సొరంగంలో కొంతకాలంగా పని చేస్తున్నారు.

# బీజేపీ వాళ్ళు చేస్తే ఒప్పు.. మేం చేస్తే తప్పా..?

మొదటిపేజీ తరువాయి

ఒకసారి ఓటరు కాంగ్రెస్ పార్టీ కాదని ఓటు వేరే పార్టీకి వేస్తే.. అది మీకు రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బంది వస్తోందని.. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికలను స్థానిక సంస్థల ఎన్నికల రిహార్సల్ అనుకుని పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. మీ ఊర్లో ఉన్న పట్టభద్రులను కాంగ్రెస్ వైపు తిప్పి.. వాళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేసే బాధ్యత స్థానిక నాయకులదేనని అన్నారు. బీజేపీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తా అన్నది.. మరీ ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వేములవాడకు నిధులు తీసుకొస్తా అన్నాడు.. ఇప్పటి వరకు ఎన్ని ఫండ్స్ తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మేం అధికారంలోకి రాగానే వేములవాడ ఆలయ అభివృద్ధి, మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్య, సిరిసిల్ల చేనేత కార్మికుల సమస్య లు పరిష్కారం చేస్తున్నామన్నారు.

మనం అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే.. బీజేపీ హిందువుల పేరుతో జనాన్ని రెచ్చగొడుతోందని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కులగణ చేసి చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంటే.. బీసీల్లో ముస్లింలు ఉన్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రధాని అయిన తర్వాతే ఈబీసీ రిజర్వేషన్లు తీసుకొచ్చారు. మోడీ తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముస్లింలను బీసీల్లో చేర్పించా అని చెప్పారూ.. మరీ వాళ్లు చేస్తే ఒప్పు మేం చేస్తే తప్పా అని బీజేపీ నేతలను నిలదీశారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు ఒక గంట ముందే ఇంటికి పోయే వెసులు బాటు కల్పిస్తే.. బీజేపీ నేతలు దానిని కూడా రాజకీయం చేస్తున్నారని.. మరీ తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలో ఉంది.

అక్కడి ప్రభుత్వం కూడా మనకంటే ముందే ముస్లిం ఉద్యోగులు గంట ముందే ఇంటికి పోయే అవకాశం కల్పించింది. మరీ దీనిపై బండి సంజయ్ ఏమంటారని ప్రశ్నల వర్షం కురిపించారు. కేంద్రమంత్రిగా ఉండి సిరిసిల్ల ప్రాంతంలో టెక్స్టైల్ కార్మికుల కోసం ఏం చేశావని నిలదీశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిదని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం (ఫిబ్రవరి 24) సాయంత్రం నాలుగు గంటలకు సీఎం రేవంత్ రెడ్డి కరీంనగర్‌కి వస్తున్నారని.. పట్టభద్రులు పెద్ద ఎత్తున హాజరై సీఎం పర్యటనను

# అంగన్‌వాడీల్లో కొలువుల పండగ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీ సంఖ్యలో పోస్టులను ప్రభుత్వం భర్తీచేయబోతోంది. అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 6,399, హెల్పర్ పోస్టులు 7,837 కలిపి 14,236 పోస్టుల భర్తీ దస్త్రంపై మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం సంతకం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లాస్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉద్యోగ నోటిఫికేషన్లు జారీకానున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత ఇన్ని ఉద్యోగాల భర్తీకి ప్రయత్నాలు జరగడం ఇదే తొలిసారి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం, చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను అందించేందుకు వీలుగా అంగన్‌వాడీ ఉపాధ్యాయ, సహాయకుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది.




### పదవీ విరమణ చేయనున్న వారితోనూ కలిపి

రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో టీచర్‌తో పాటు హెల్పర్ తప్పనిసరి. గతంలో ఈ పోస్టులకు ఎంపికైన వారిలో పలువురు రాజీనామాలు చేయడం, ఇప్పటికే పనిచేస్తున్న వారికి సూపర్‌వైజర్లుగా పదోన్నతులు రావడంతో సిబ్బంది కొరత నెలకొంది. 65 ఏళ్ల వయసు నిండిని పలువురు పదవీవిరమణ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్నవారిలో 65 ఏళ్ల వయసు దాటిన టీచర్లు 3,914 మంది ఉన్నారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం వీరందరూ పదవీవిరమణ చేయనున్నందున ఆ పోస్టులనూ నోటిఫికేషన్లో పేర్కొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

### ఇంటర్మీడియట్ అర్హత తప్పనిసరి

గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు కనీసం పదో తరగతి పాసై ఉండాలన్న నిబంధన ఉండేది. కేంద్రం జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం.. టీచర్‌తో పాటు హెల్పర్లకు కనీసం ఇంటర్ పాసైన అనుభవం ఉండాలి. దీంతో ఇంటర్మీడియట్ అర్హతను తప్పనిసరి చేయనున్నారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి వయోపరిమితి 18 నుంచి 35 ఏళ్లుగా కేంద్రం పేర్కొంది.

### 567 మంది సహాయకులకు టీచర్లుగా పదోన్నతి?

కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీలో 50 శాతం.. సహాయకులకు కేటాయించాలి. అయితే ప్రస్తుతం పనిచేస్తున్న సహాయకుల్లో టీచర్లుగా పదోన్నతి పొందేందుకు చాలా మందికి విద్యార్హతలు లేవు. ఇంటర్మీడియట్ పాసైన హెల్పర్లు 567 మంది మాత్రమే ఉన్నట్లు శిశు సంక్షేమశాఖ గుర్తించింది. వారందరికీ పదోన్నతులు లభించే అవకాశాలున్నాయి.

**మొత్తం ఖాళీలు ఇలా..**

పదవీ విరమణ చేయనున్న సిబ్బంది: 3,914
టీచర్ పదోన్నతులకు అర్హులైన సహాయకులు: 567
ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులు: 1,918
ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టులు: 7,837

# ఒకే రోజు మూడు జిల్లాల్లో సీఎం రేవంత్ టూర్.. షెడ్యూల్ రిలీజ్

మొదటిపేజీ తరువాయి

**రేవంత్ షెడ్యూల్**

ఫిబ్రవరి 24న ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్ బేగంపేట్ ఎయిర్ పోర్ట్ నుంచి నిజామాబాద్ కు బయల్దేరతారు. 11.45 నిమిషాలకు అక్కడ ల్యాండ్ అవుతారు. 11.50 గంటల నుంచి మధ్యాహ్నం1.30 గంటలకు బహిరంగ సభలో మాట్లాడతారు

ఫిబ్రవరి 24న మధ్యాహ్నం 2 గంటల 15 నిమిషాలకు మంచిర్యాలకు చేరుకుంటారు. 2.20 గంటల నుంచి 3.55 గంటల వరకు సభలో పాల్గొంటారు

ఫిబ్రవరి 24న సాయంత్రం 4.20 గంటలకు కరీంనగర్ కు చేరుకుంటారు . కరీంనగర్లోని బహిరంగ సభలో 4.25 గంటల నుంచి 5.50 గంటల వరకు మాట్లాడతారు

## యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి – బంగారు గోపురం ఆవిష్కరణ

మొదటిపేజీ తరువాయి

**ముఖ్యమైన అంశాలు:**

గురుత్వం: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధిలో కీలక ఘట్టం.

బంగారు గోపురం: ఆలయ గోపురాన్ని శ్రీవారి సేవార్థం బంగారు తాపడం చేసి అద్భుతంగా రూపుదిద్దించారు.

విశేష పూజలు: సీఎం రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

అభివృద్ధి సమీక్ష: ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రజా కలయిక: భక్తులతో కలిసి ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రభుత్వ అధికారులు, ఆలయ అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ యాదాద్రిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది అని తెలిపారు. మరిన్ని అప్‌డేట్స్ కోసం చూస్తూ ఉండండి%ొ

# కోహ్లీ సెంచరీ..

## పాక్‌పై భారత్ ఘన విజయం

మొదటిపేజీ తరువాయి

దుబాయ్: ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్.. 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. ఈ టార్గెట్‌ని టీమ్‌ఇండియా 42.3 ఓవర్లలో వికెట్లు 4 కోల్పోయి ఛేదించింది. విరాట్ కోహ్లీ (100లిబీ 111 బంతుల్లో 7 ఫోర్లు) బౌండరీ బాది శతకం పూర్తి చేసుకోవడంతో మ్యాచ్‌ను ముగించాడు. శ్రేయస్ అయ్యర్ (56బీ 67 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (46బీ 52 బంతుల్లో 7 ఫోర్లు) రాణించారు. రోహిత్ శర్మ (20బీ 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. పాక్ బౌలర్లలో షహీన్ షా అఫ్రిది 2, అబ్రార్ అహ్మద్, ఖుల్‌దిష్ షా ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో పాక్‌పై ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. కోహ్లీకిది వన్డేల్లో 51వ సెంచరీ కావడం విశేషం. ఈ గెలుపుతో భారత్ దాదాపు సెమీస్ చేరగా.. పాక్ నాకౌట్ ఆశలు గల్లంతయ్యాయి. పాక్ బ్యాటర్లలో సౌద్ షకీల్ (62బీ 76 బంతుల్లో 5 ఫోర్లు), మహ్మద్ రిజ్వాన్ (46బీ 77 బంతుల్లో 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఈ జోడీ మూడో వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఓపెనర్లు ఇమామ్ ఉల్ హక్ (10), బాబర్ అజామ్ (23) పరుగులు చేశారు. సల్మాన్ అఘా (19), ఖుష్‌దిల్ షా (38) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 3, హార్దిక్ పాండ్య 2, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా తలో వికెట్ పడగొట్టారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఫిబ్రవరి 24 2025

# స్వతంత్ర సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి.



**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, ఫిబ్రవరి 23.**
భారతరత్న స్వతంత్ర సమరయోధులు ప్రథమ విద్యాశాఖ మంత్రి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి శనివారం స్థానిక కాంగ్రెస్ భవన్ జువాడి నర్సింగ్ రావు నాయకత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివని కొనియాడారు . ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గం పట్టభద్రుల ఎన్నికల ఇంచార్జ్ వరంగల్ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , కోరుట్ల నియోజకవర్గం ఎన్నికల కోఆర్డినేటర్ భాస వేణు యాదవ్, టిపిసిసి కమ్యూనికేషన్ కోఆర్డినేటర్ ఎండి అవేజ్ , పట్టణ అధ్యక్షులు జట్టిలింగం, మండల అధ్యక్షులు అంజిరెడ్డి, ఏర్రోల హనుమాన్లు యాదవ్, మార్గం గంగాధర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు వెంట ప్రణయ్ ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు విజయ్ పటేల్ మాజీ జెడ్పిటిసి సభ్యులు ఆకుల లింగారెడ్డి అబ్దుల్ షకీల్ బత్తుల భరత్ సురేష్ జెట్టి లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు

## అందుబాటులో లేని వ్యవసాయ అధికారులు...
## - రైతులకు అందని సమాచారం

**కరపత్రం గన్నేరువరం ఫిబ్రవరి 23**
రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుంటే గన్నేరువరం వ్యవసాయ మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయనికి ఎప్పుడు వెళ్ళిన అధికారులు అందుబాటులో వుండడం లేదని రైతులు వాపోతున్నారు. మండల కేంద్రానికి చెందిన బుర్ర సత్తయ్య గౌడ్ అనే రైతు వరి పంటపై సూచనల కొరకు శనివారం మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు గన్నేరువరం



అగ్రికల్చర్ ఆఫీస్ కి వెళ్ళాడు. ఆఫీసుకు తాళం వేసి ఉండడంతో అధికారుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశాడు. ఎప్పుడు వచ్చినా అధికారులు అందుబాటులో ఉండడం లేదని, వ్యవసాయ అధికారులు సూచనలు సలహా మేరకు సాగు చేయాలని ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు సభలు ఏర్పాటు చేసి చెబుతుంటే తెలుసుకుందామని కార్యాలయానికి వెళ్తే అధికారులు అందుబాటులో లేక వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితిఏర్పడుతుందన్నారు. మారుమూల మండలం కావడంతో ఉన్నత అధికారుల పర్యవేక్షణ కూడా కరువైందన్నారు. ఏది ఏమైనా అధికారులు స్పందించి సీజన్లో రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## నర్సరీ కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం.

### - ఏఐటియుసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ వెల్లడి

**కరపత్రం రామగుండం ఫిబ్రవరి, 23:**
సింగరేణి వ్యాప్తంగా నర్సరీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన



సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 2022 లో చేసిన 18 రోజుల సమ్మె సందర్భంగా యూనియన్ లు యాజమాన్యం తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అట్టి ఒప్పందం లోని డిమాండ్ లను అమలు చేయాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి కోరిన మేరకు యాజమాన్యం నర్సరీ లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్ట బద్ధమైన హక్కులను అమలు చేసేందుకు తగు ఆదేశాలు జారీ చేసిందని ఆయన వెల్లడించారు. గుర్తింపు సంఘం ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు కృషి ఫలితంగా సింగరేణి వ్యాప్తంగా నర్సరీ కార్మికులకు మార్చి 1వ తేదీ నుండి కనీస వేతనాల అమలు,సీఎం పిఎఫ్, బోనస్సు,బ్యాంకు జీతాలు తదితర హక్కుల ను అమలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. కనుక నర్సరీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఏఐటియుసి కృషి ని గమనించగలరని ఆయన ఒక ప్రకటన లో పేర్కొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య

**కరపత్రం ప్రతినిది .నిజాంపేట్....**
నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన షేర్ల ప్రదీప్ కుమార్ S/o జోసెఫ్, వయసు: 35 సంవత్సరాలు అను వ్యక్తికి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే ప్రదీప్ మూడు సంవత్సరాల క్రితం క్యాన్సర్ వ్యాధి సోకడంతో చికిత్స నిమిత్తమై తెలిసిన వారి వద్ద అప్పులు చేసినాడని, అట్టి వ్యాధి నయం అయిన తర్వాత చేసిన అప్పులు తీర్చుటకు మార్గం లేక మనస్థాపము చెంది, జీవితం పై విరక్తితో తన



ఇంట్లోనే ఫ్యాన్ కి తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు, అని అతని భార్య షేర్ల ఏసుమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిజాంపేట SHO కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించరు.

## ఫీజుల పేరిట విద్యార్థులను వేధిస్తే చూస్తూ ఊరుకోం ఏఐఎస్ఎఫ్...

**- చదువుకునే రోజులు కాదు ఇవి చదువుకొనే రోజులు..**
**- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం.**

**కరపత్రం రామగుండం ఫిబ్రవరి, 23:**
పెద్దపెల్లి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరిట విద్యార్థులను వేధిస్తే చూస్తూ ఊరుకోమని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చదువుకునే రోజులు పోయి చదువుకొనే రోజులు వచ్చాయని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యా వ్యాపారం చేస్తున్నాయే తప్ప,



విద్యాభివృద్ధికి తోడ్పాటు నందిస్తలేవని ఆయన అన్నారు. ఫీజులు త్వరగా చెల్లించాలని, చెల్లించని విద్యార్థులను తోటి స్నేహితుల ముందే నిలబెట్టి అవమానపరిచే విధంగా, మనస్థాపానికి గురయ్యే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. ఫీజులు త్వరగా చెల్లించకపోతే పరీక్షలు నిర్వహించమని,హాల్ టికెట్స్ ఇవ్వమని విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ, విద్యను దూరం చేసే విధంగా చేస్తున్నారని ఆయన వాపోయారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీని, అవేమి పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థులను ఫీజుల పేరిట వేధిస్తే చూస్తూ ఊరుకోమని, విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో కలిసి పాఠశాలల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## పులి ప్రసన్న హరికృష్ణ ని అత్యధిక మెజారిటీతో గెలిపించండి.

**కరపత్రం గన్నేరువరం, ఫిబ్రవరి 23**
పులి ప్రసన్న హరికృష్ణ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండలంలోని కొండాపూర్ గ్రామం లో ని పట్టభద్రులను సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి శ్రీనివాస్ గౌడ్ కలిసారు. ఈ సందర్భంగా పట్టభద్రులతో ఆయన మాట్లాడుతూ విద్యా



వ్యవస్థను బలోపేతం చేయాలనే సంకల్పం తో ప్రైవేటు ఉద్యోగుల సమస్య ల పరిష్కారం కోసం జాబ్ క్యాలెండర్, ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగుల కోసం జాబ్ మేళాలు, నిరుపేదలైన పిల్లలకు చదువుకునే అవకాశాన్ని ఒక ట్రస్ట్ ద్వారా ఏర్పరచి, జిల్లాలలో ఖచ్చితమైన ప్రణాళికతో మార్పు తీసుకువచ్చే అభ్యర్థి పులి ప్రసన్న హరికృష్ణ అని కావున ఆయనకు ఏమ్మెల్సీ గా అవకాశం కల్పించాలని బ్యాలెట్ పేపర్ లో వరుస సంఖ్య 3 పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ శ్రీనివాస్ గౌడ్, న్యాలపట్ల శంకర్ గౌడ్, న్యాలపట్ల ఎల్లయ్య గౌడ్, కొరివి విజయ్, శారద తదితరులు పాల్గొన్నారు.

## మైలారం శ్రీ మల్లికార్జున స్వామి ఆవరణలో యాగశాలకు భూమి పూజ..

**కరపత్రం గన్నేరువరం ఫిబ్రవరి 23**
**మండలంలోని మైలారం గ్రామంలో**
**శ్రీ మల్లికార్జున స్వామి చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు,**
గ్రామ ప్రజలు మైలారం గ్రామంలో సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన శ్రీ మల్లికార్జున స్వామి ఆవరణలో యాగశాల పనులను ఆలయ కమిటీ చైర్మన్ వరాల పరుశరాములు, కమిటీ



సభ్యులు, ప్రధాన పూజారి మామిడాల నాగ సాయి శర్మ ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మానేరు నది ఒడ్డున పచ్చని చెట్లు, గుట్ట సమీపంలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి గర్భగుడిలో సర్టేడు వారాలలో పచ్చి పసుపు రాలడం విశేషం. కోరిన వారికి కోరికలు తీరుస్తూ కొంగుబంగారంగా మారుతున్నారు. పక్కనే సమ్మక్క సారలమ్మ, నల్ల పోచమ్మ, ఎల్లమ్మ తల్లి,ఆంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాలు ఉండడం విశేషం అన్నారు. యాగశాల నిర్మాణానికి రావుల సుభాష్ శశికళ, సాయి, కేశ అంజయ్య రాజేశ్వరి, సంతోష్, సూపరి రాజిరెడ్డి లక్ష్మి ,విజయ రెడ్డి దాతలు సాకారం అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు పూజారులు, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మల్లాపూర్ మండల కేంద్రంలో ఎంపీ అరవింద్ ధర్మపురి పర్యటన

**కరపత్రం మల్లాపురం ప్రతినిధి ఫిబ్రవరి 23**
మల్లాపూర్ మండల కేంద్రంలో ఈరోజు నిజామాబాదు పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ పర్యటించారు ఈ పర్యటనలో భాగంగా ఎంఎల్సి గా పోటీ చేస్తున్న భారతీయ జనతా



పార్టీ అభ్యర్థి అంజిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఈ గెలుపు ద్వారా పట్టభద్రుల అలాగే ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు అలాగే భాజపా కార్యకర్త లవంగ శివ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీ వెంట మల్లాపూర్ మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి అలాగే భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## స్వతంత్ర సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి.

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, ఫిబ్రవరి 23.**
భారతరత్న స్వతంత్ర సమరయోధులు ప్రథమ విద్యాశాఖ మంత్రి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి శనివారం స్థానిక కాంగ్రెస్ భవన్



జువాడి నర్సింగ్ రావు నాయకత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివని కొనియాడారు . ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గం పట్టభద్రుల ఎన్నికల ఇంచార్జ్ వరంగల్ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , కోరుట్ల నియోజకవర్గం ఎన్నికల కోఆర్డినేటర్ భాస వేణు యాదవ్, టిపిసిసి కమ్యూనికేషన్ కోఆర్డినేటర్ ఎండి అవేజ్ , పట్టణ అధ్యక్షులు జట్టిలింగం, మండల అధ్యక్షులు అంజిరెడ్డి, ఏర్రోల హనుమాన్లు యాదవ్, మార్గం గంగాధర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు వెంట ప్రణయ్ ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు విజయ్ పటేల్ మాజీ జెడ్పిటిసి సభ్యులు ఆకుల లింగారెడ్డి అబ్దుల్ షకీల్ బత్తుల భరత్ సురేష్ జెట్టి లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు

## మహారాష్ట్ర మాజీ గవర్నర్ ను కలిసిన బీజేపీ నేతలు

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, ఫిబ్రవరి 23.**
మహారాష్ట్ర మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి చెన్నమనేని విద్యా సాగర్ రావు ఆదివారం బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ చిట్నేని రఘు , బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాచకొండ యాదగిరి బాబు, సీనియర్ నాయకులు ఏలేటి నరేందర్ రెడ్డి సహా కలిశారు. మెట్ పల్లి పట్టణంలోని బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ చిట్నేని రఘు నివాసంలో కొద్దిసేపు సేద తీరారు.



ఆయన ఇచ్చిన తేనీటి విందును మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్న మనేని విద్యాసాగర్ రావు స్వీక రించారు. అనంతరం పార్టీతో పాటు, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. పార్టీని మరింత బలపేతం చేయడానికి తీసుకోవలసిన వ్యవహారాలు, రాజ కీయ అంశాలపై కొద్ది సేపు మాట్లాడా రు. వారి వెంట పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ప్రసన్న హరికృష్ణ ఎమ్మెల్సీ అభ్యర్థి గారికే మొదటి ఓటు వేయండి.



**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, ఫిబ్రవరి 23.**
పట్ట బద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కు మొదటి ప్రాధా న్యత ఓటు వేయాలని ఆదివారం మెట్టుపల్లి పట్టణం అంబేద్కర్ స్టేడి యంలో పట్ట బద్రులను కలసి మొదటి ఓటు వేయాలని అభ్యర్థిస్తూ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాటకరి సాయన్న కూడా గెలిపిం చాలని ప్రచారం చేయడం జరిగింది ఈ ప్రచారం కార్యక్రమం లో బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు మరియు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల లక్ష్మణ్, గోరు మంతుల సురేందర్, పురుషోత్తం, బద్రి, పులిమామిడి ప్రవీణ్, నరేష్, ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు..

## ఘనంగా సత్యలక్ష్మీ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు.



**కరపత్రం గన్నేరువరం ఫిబ్రవరి 23**
గన్నేరువరం మండల కేంద్రంలో శ్రీ సత్యలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలను ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా సత్యలక్ష్మీ అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించి డప్పుచప్పుడులతో, మంగళ వాయిద్యాలతో, నృత్యాలు చేస్తూ ఊరేగింపు చేశారు. అమ్మవారికి మొక్కలు చెల్లించి నైవేద్యాలు సమర్పించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు, వైశు ్యలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# 1971 తర్వాత తొలిసారి పాక్-బంగ్లా మధ్య ప్రత్యక్ష వాణిజ్యం



**కరపత్రం డెస్క్ ఫిబ్రవరి 23:** 1971 తర్వాత తొలిసారి పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రత్యక్ష వాణిజ్యాన్ని పునఃప్రారంభించాయి. ఇంటర్నెట్ డెస్క్: షేక్ హసీనా పదవికోల్పోయిన తర్వాత యూనస్ నేతృత్వంలో బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. భారత్‌కు దూరం జరుగుతూ పాకిస్థాన్ (%ఖుఎఅఖుఅ%) అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. 1971లో పాక్, బంగ్లాదేశ్‌లు విడిపోయిన తర్వాత తొలిసారిగా ప్రత్యక్ష వాణిజ్యాన్ని పునఃప్రారంభించాయి. ప్రభుత్వం ఆమోదించిన మొదటి కార్గో కరాచీలోని పోర్ట్ ఖాసిమ్ నుంచి ఢాకాకు బయలుదేరినట్లు పలు మీడియా వర్గాలు వెల్లడించాయి.

ఫిబ్రవరి ప్రారంభంలో ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ 50,000 టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు అంగీకరించడంతో ఈ ఒప్పందం ఖరారు అయినట్లు తెలుస్తోంది. "1971 తర్వాత మొదటిసారిగా పాకిస్థాన్ నేషనల్ షిప్పింగ్ కార్పోరేషన్ నౌక బంగ్లాదేశ్ ఓడరేవుకు తమ ప్రభుత్వ సరుకును తీసుకెళ్తోంది. ఇది ఇరుదేశాల మధ్య సముద్ర వాణిజ్య సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తోంది" అని ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ వార్తాపత్రిక పేర్కొంది. ఈ రవాణా రెండు దశల్లో పూర్తవుతుందని..ప్రస్తుతం 25వేల టన్నుల బియ్యం తరలించారని వెల్లడించింది. మరో 25,000 టన్నుల బియ్యం మార్చి ప్రారంభంలో పంపే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

లిబరల్స్ మాపై బురద జల్లుతున్నారు: ఇటలీ ప్రధాని మెలోనీ

గత ఏడాది డిసెంబర్‌లో 53 ఏళ్లలో తొలిసారి పాక్ నుంచి నేరుగా బంగ్లాకు తొలికార్గో షిప్ వచ్చినట్లు అప్పట్లో స్థానిక మీడియా కథనాలు వెలువడ్డాయి. పనామా జెండాతో ఉన్న ఆ నౌక 811 కంటైనర్లలో సోడాయాష్, మార్బుల్ బ్లాక్, ముడివస్త్రాలు, చక్కెర, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల వంటి వాటిని మోసుకొచ్చిందని వార్తా సంస్థలు వెల్లడించాయి. 1971లో బంగ్లాదేశ్ తూర్పు పాకిస్థాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాటి నుంచి ఇరుదేశాల మధ్య ఎటువంటి వాణిజ్య సంబంధాలు లేవు. ఇన్నేళ్ల అనంతరం ఇరుదేశాల మధ్య జరుగుతున్న తాజా వాణిజ్య ఒప్పందాలు రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాల బలోపేతం చేస్తూ.. ప్రత్యక్ష రవాణా మార్గాలను సులభతరం చేయడానికి ఉపయోగపడుతున్నట్లు తెలుస్తోంది.

## నస్రల్లా అంత్యక్రియలకు పోటెత్తిన ప్రజలు.. నింగిలో ఇజ్రాయెల్ యుద్ధవిమానాల చక్కర్లు



**కరపత్రం డెస్క్ ఫిబ్రవరి 23:**
హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా అంత్యక్రియలకు ప్రజలు పోటెత్తారు. గతేడాది సెప్టెంబరులో ఇజ్రాయెల్ దాడుల్లో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే.

లెబనాన్ 'హెజ్‌బొల్లా' మాజీ అధినేత హసన్ నస్రల్లా (64) అంత్యక్రియలకు ఆయన మద్దతుదారులు, ప్రజలు పోటెత్తారు. గతేడాది సెప్టెంబరులో ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. ఇది జరిగిన దాదాపు ఐదు నెలలకు లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఆయన అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. నస్రల్లా బంధువు, హెజ్‌బొల్లా వారసుడిగా భావించిన హషీమ్ సఫీద్దీన్‌కూ తుదివీడ్కోలు పలకనున్నారు. ఇరువురికి నివాళులు అర్పించేందుకు వచ్చిన వేలాది మందితో బీరూట్‌లోని స్టేడియం కిక్కిరిసిపోయింది. మరోవైపు.. బీరూట్ గగనతలంలో ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు చక్కర్లు కొడుతున్నాయి.

గతేడాది సెప్టెంబరులో బీరుట్ దాహియా ప్రాంతంలోని హెజ్‌బొల్లా కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లోనే నస్రల్లాతో పాటు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ దళానికి చెందిన డిప్యూటీ కమాండర్ జనరల్ అబ్బాస్ నీలోఫరసన్ తదితరులు ప్రాణాలు కోల్పోయారు. కొన్ని రోజులకు మరో దాడిలో సఫీద్దీన్ సైతం మృతి చెందారు. అప్పట్లో ఇద్దరిని తాత్కాలికంగా రహస్య ప్రదేశాల్లో ఖననం చేశారు. వారికి అధికారిక అంత్యక్రియలు నిర్వహిస్తామంటూ ఇటీవల హెజ్‌బొల్లా ప్రకటించింది. ఈ క్రమంలోనే బీరూట్‌లో నస్రల్లాను, సఫీద్దీన్‌ను దక్షిణ లెబనాన్‌లోని ఆయన స్వస్థలంలో ఖననం చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రజల సందర్శనార్థం ఆదివారం వారి శవపేటికలను బీరూట్‌లోని స్టేడియానికి తరలించింది.

ఈ కార్యక్రమానికి 65 దేశాల నుంచి 800 మంది ప్రముఖులు విచ్చేసినట్లు హెజ్‌బొల్లా వర్గాలు తెలిపాయి. ఇరాన్ నుంచి పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘెర్ ఖాలిబఫ్, విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చి హాజరయ్యారు. అంత్యక్రియల సమయంలో బీరూట్ గగనతలంపై తమ యుద్ధవిమానాలు చక్కర్లు కొడుతుండటంపై ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి కాట్జ్ స్పందించారు. తమ దేశం జోలికొస్తే ఎవరికైనా ఇదే పరిస్థితి ఎదురవుతుందనే సందేశాన్ని చాటుతున్నట్లు తెలిపారు. అంతకుముందు దక్షిణ, తూర్పు లెబనాన్‌లోని ఆయుధ నిల్వల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేపట్టినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

## యుద్ధానికి మూడేళ్లు.. 267 డ్రోన్లతో రష్యా అతిపెద్ద దాడి!

**కరపత్రం డెస్క్ ఫిబ్రవరి 23:**
ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర కు సోమవారానికి సరిగ్గా మూడేళ్లు. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌వ్యాప్తంగా పుతిన్ సేనలు మరోసారి భీకర దాడులకు పాల్పడ్డాయి. శత్రుదేశం ఏకంగా 267 డ్రోన్లు ప్రయోగించినట్లు కీవ్ ఆరోపించింది. యుద్ధం మొదలు ఒకేసారి ఈస్థాయిలో డ్రోన్లతో దాడులకు పాల్పడటం ఇదే మొదటిసారని ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమాండ్ ప్రతినిధి యూరీ ఇగ్నాత్ తెలిపారు. అయితే, వాటిలో సగానికిపైగా కూల్చేసినట్లు చెప్పారు. ప్రాణనష్టం తదితర వివరాలు తెలియాల్సి ఉందన్నారు.గత వారం వ్యవధిలో దాదాపు 1150 డ్రోన్లు, 1400కుపైగా గైడెడ్ ఏరియల్ బాంబులు, 35 క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యా రక్షణశాఖ సైతం తమ దేశంలోకి కీవ్ సేనలు 20 డ్రోన్లను ప్రయోగించిందని, వాటిని నాశనం చేసినట్లు తెలిపింది. మరోవైపు.. 'డిఫెండర్ ఆఫ్ ది ఫాదర్‌ల్యాండ్ డే'



పురస్కరించుకుని రష్యా అధినేత పుతిన్.. సైనికుల త్యాగాలను స్మరించుకున్నారు. యుద్ధంలో పోరాడిన సిబ్బందికి పతకాలను ప్రదానం చేశారు.లిబరల్స్ మాపై బురద జల్లుతున్నారు: ఇటలీ ప్రధాని మెలోనీ

2022 ఫిబ్రవరి 24న 'ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్' పేరుతో రష్యా యుద్ధాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. నాటో విస్తరణను నిలువరించే ప్రయత్నం, డాన్‌బాస్ విమోచనం, నాజీయిజం నిర్మూలన వంటివి తమ లక్ష్యాలుగా పుతిన్ ప్రకటించారు. మొదట్లో మాస్కో సేనలు దూకుడు కనబర్చినా.. అనంతరం పాశ్చాత్య దేశాల ఆయుధ సాయంతో కీవ్ సైతం దీటుగా స్పందించింది. మూడేళ్లలో ఇరువైపులా లక్షలాదిమంది సైనికులు మరణించారు/గాయపడ్డారు. కోట్ల డాలర్ల మేర ఆస్తినష్టం వాటిల్లింది. అయితే, ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ పునరాగమనంతో యుద్ధం ముగింపు దిశగా ప్రయత్నాలు మొదలైనట్లు తెలుస్తోంది.పోప్ శాంతిసందేశం..తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోప్ ఫ్రాన్సిస్.. ఉక్రెయిన్ యుద్ధానికి మూడేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో శాంతి సందేశాన్ని విడుదల చేశారు. ఈ యుద్ధం ప్రారంభాన్ని.. మానవాళికి బాధాకరమైన సందర్భంగా పేర్కొన్నారు. "ఉక్రెయిన్ ప్రజలకు సంఘీభావాన్ని పునరుద్ఘాటిస్తున్నాను. యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయినవారిని మనం గుర్తుంచుకోవాలి. పాలస్తీనా, ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యం, మయన్మార్, సూడాన్ వంటి ప్రాంతాల్లో శాంతి కోసం ప్రార్థించండి" అని పోప్ పిలుపునిచ్చారు.

## యూఎస్‌ఎయిడ్‌ను భారత్ అవకాశంగా తీసుకుంటోంది: ట్రంప్

**కరపత్రం డెస్క్ ఫిబ్రవరి 23:**
యూఎస్‌ఎయిడ్‌ను అవకాశంగా తీసుకొని భారత ప్రభుత్వం ప్రయోజనాన్ని పొందుతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు.

ఇంటర్నెట్ డెస్క్: భారత్ లో ఎవరినో గెలిపించడానికి గత అధ్యక్షుడు జో బైడెన్ రూ.182 కోట్ల నిధులను కేటాయించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆరోపణలు చర్చనీయాంశమయ్యాయి. తాజాగా ఈ విషయంపై మరో సారి ఆయన మాట్లాడుతూ.. యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అవకాశంగా తీసుకొని భారత్ ప్రయోజనం పొందుతోందని ఆరోపించారు.

ఎన్నికలలో పోలింగ్ శాతం పెంచడానికి సహాయంగా భారతదేశానికి అమెరికా ప్రభుత్వం రూ.182 కోట్లు ఇచ్చిందని ట్రంప్ ఆరోపించారు. ప్రపంచంలో అధిక సుంకాలు విధించే దేశాల్లో ఒకటైన భారత్ వద్ద చాలా డబ్బు ఉందని, ఆ దేశానికి తామెందుకు నిధులు ఇవ్వాలని ప్రశ్నించారు. భారత ఎన్నికల్లో ఓటు వేసేవారి సంఖ్యను పెంచేందుకు అమెరికా ఇస్తున్న 21 మిలియన్ డాలర్ల నిధులను రద్దు చేస్తూ ఎలాన్ మస్క్ సారథ్యంలోని డోజ్ తీసుకున్న నిర్ణయాన్ని ట్రంప్ సమర్థించారు.

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ నిధులను వినియోగించి ఉండొచ్చని ట్రంప్ పలుమార్లు



పేర్కొన్నారు. అయితే, తమ దేశంలో ఓటర్ల శాతాన్ని పెంచాల్సిన అవసరం కూడా ఉంది కాబట్టి ఈ నిధులను ఆపివేసినట్లు వివరించారు. అమెరికా చేస్తున్న ఆరోపణలపై భారత ప్రభుత్వం స్పందిస్తూ.. ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు యూఎస్‌ఎయిడ్ ప్రయత్నించిందనే వార్తలు తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయని పేర్కొంది.

### నిజాలు బయటకు వస్తాయి..

భారత ఎన్నికల్లో విదేశీ జోక్యానికి సంబంధించి ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రకటనలను ప్రభుత్వం పరిశీలిస్తోందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ శనివారం అన్నారు. పూర్తి సమాచారం వచ్చిన తర్వాతే దీనిపై మరిన్ని వివరాలు వెల్లడిస్తామని.. అసలు వాస్తవాలు తప్పకుండా వెలుగులోకి వస్తాయని తెలిపారు. యుఎస్‌ఎయిడ్ అనేది ఓ మంచి ఉద్దేశంతో ప్రపంచ దేశాలకు సాయం చేయడానికి రూపొందించిన విభాగమని పేర్కొన్నారు. అయినప్పటికీ దాని ద్వారా నిధులు దుర్వినియోగం అయ్యాయని అమెరికా అధ్యక్షుడు ఆరోపించడం ఆలోచించదగ్గ విషయమని అన్నారు.

కాగా ఈ విషయంలో దేశంలో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. 2024 ఎన్నికల్లో విదేశీ శక్తులు పని చేస్తున్నాయని అప్పట్లో ప్రధాని మోదీ చేసిన ఆరోపణలు తాజాగా ట్రంప్ వ్యాఖ్యలతో నిజమని తేలిందని భాజపా పేర్కొంది. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలు అర్థం లేని ఆరోపణలేనని కాంగ్రెస్ స్పష్టం చేసింది. యూఎస్ ఎయిడ్ ద్వారా దశాబ్దాలుగా భారత్‌లోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు అందిన సాయంపై కేంద్రం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేసింది.